క్లుప్తంగా

ఐటీఐలో అడ్మిషన్లు

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరు పల్లె వద్ద వున్న ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సివిల్ రెండేళ్లు, డీజిల్ మెకానిక్ సంవత్సరం, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీలో మహిళలకు ఒక సంవత్సరం కోర్సులు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

హౌసింగ్ ఏఈగా ప్రణయ్‌కుమార్



సదుం: మండల హౌసింగ్ ఏఈగా ప్రణయ్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కుప్పంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం

పుంగనూరు: నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, విభజనపై తహసీల్దార్ రాము గురువారం అధికారులు, నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర విషయాలపై సూచనలు, సలహాలు అందించాలన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సదుం: మండలంలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కోరారు. వారు గురువారం తహసీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 30 కుటుంబాల వారికి ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ పది రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నాయకులు ప్రసాదరావు, భానుప్రకాశ్, శంకర, కళావతి, భాను తదితరులు పాల్గొన్నారు.

కోగిలేరు ఎస్టీ కాలనీలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మాధవి

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు ఎస్టీ కాలనీలో గురువారం సర్పంచ్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రాయలపేట పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి 62 మందికి రక్త పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. రాయలపేట పీహెచ్‌సీకి నలుగురిని, పలమనేరు ఏరియా ఆస్పత్రికి ఇద్దరిని రెఫర్ చేసినట్లు డాక్టర్ చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, ఎంపీహెచ్ఎస్ రాధాకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ కుసుమకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. శంకర్ నేత్రాలయ వైద్యులు వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేస్తారని వెల్లడించారు. కంటి జబ్బులు కలిగిన వారు శిబిరంలో పాల్గొని చికిత్స చేయించుకోవాలని కోరారు.

మొగిలిలో ఆక్రమణల తొలగింపు



మొగిలిలో రోడ్డు పక్కన ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలను గురువారం తొలగించినట్లు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. శ్రీనిఫుడ్స్ సమీపంలో గల మొగిలి క్రాస్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, రహదారి ఆక్రమణలను ఆర్డీవో భవానీ పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీస్, ఎన్‌హెచ్ అధికారులు తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మా గ్రామాలకు
బస్సులు నడపండి సారూ..!



గంగవరం మండలంలోని కీలపట్లకు ఆటోలే దిక్కు

- 70కి పైగా గ్రామాలకు తిరగని బస్సులు
- ఆటోల్లో వెళుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- బస్సులు నడపాలని అధికారులను కోరుతున్నా ఫలితం శూన్యం

మా గ్రామాలకు రోడ్లున్నా బస్సులు రావడం లేదు. ఆటోలను నమ్ముకుని ప్రయాణం సాగించాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో తిప్పలు తప్పడం లేదు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఆస్పత్రులకు వెళ్లాలంటే అనేక బాధలు పడాల్సి వస్తోంది. రైతులు పండించిన పంటను మార్కెట్‌కు తరలించడం ఇబ్బందిగా తయారైంది. బస్సులు నడపాలని పలుమార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిందని, తమ గ్రామాలకు కనీసం బస్సులైనా నడపాలని పలమనేరు డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సముద్రపల్లికి వెళుతున్న ఆటో



గ్రామీణ ప్రాంతాలకు నడుస్తున్న ఆటో

పలమనేరు: రెవిన్యూ డివిజన్ కేంద్రమైన పలమనేరు మండలంలోనే సగానికి పైగా గ్రామాలకు ఇప్పటికీ బస్సు యోగం లేదు. దీంతో గ్రామీణ ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అప్పుడప్పుడూ వచ్చే ఆటోలో ఒకరిపై ఒకరు పడుతూ ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పలమనేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 70కి పైగా గ్రామాలకు తారు రోడ్లున్నా బస్సు సౌకర్యం లేదు. రెవెన్యూ డివిజన్ హెడ్‌క్వార్టర్స్ అయిన పలమనేరు మండలంలో పది పంచాయతీలున్నాయి. మండలానికి మూడువైపులా అటవీ ప్రాంతం ఉంది. దాదాపు అన్ని గ్రామాలకు తారు రోడ్లు ఉన్నాయి. బస్సులు మాత్రం లేవు. కురప్పల్లి, తొప్పనపల్లి, కల్లాడు, మాదిగబండ, ఎస్ఆర్‌పురం, ఎస్టీ కాలనీ, పెంగరగుంట, సముద్రపల్లి, నూనేవారిపల్లి, కరిడిమొడుగు, నలగాంపల్లి, జగమర్ల, సంబార్‌పూర్ గ్రామాలకు ఆటోలు లేదా బైక్‌లే దిక్కు. కొందరు ఇప్పటికీ కాలినడకనే ప్రయాణం సాగిస్తున్నారు. గతంలో అన్ని ప్రాంతాలకు బస్సులు నడిచేవి. నష్టాలు వస్తున్నాయని పేర్కొంటూ ఆర్టీసీ అధికారులు బస్స సర్వీసులను ఆపేశారు. మిగిలిన పల్లెలకు అసలు బస్సులే వెళ్లవు. మండలంలోని పెద్ద పంచాయతీ అయిన మండిపేటకోటూరుకు సైతం బస్సుల్లేవు.

ఇదే పరిస్థితి మిగిలిన మండలాల్లోనూ...

నియోజకవర్గంలో 90 పంచాయతీలు, 450 దాకా గ్రామాలున్నాయి. వీటిలో సగానికి పైగా గ్రామాలకు రోడ్లున్నా ఇప్పటికీ బస్సులు నడవడంలేదు. గంగవరం మండలంలో ప్రఖ్యాత కోనేటిరాయుని ఆలయం ఉన్న కీలపట్లకు సైతం ఇప్పటికీ ఆటోలో దిక్కు. కొత్తపల్లినుంచి కలిమిచెట్లపెంట, గాంధీనగర్, దండపల్లి మీదుగా మాడి తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. బైరెడ్డిపల్లి మండలంలోని ధర్మపురి, చప్పిడిపల్లి, మేకల నాగిరెడ్డిపల్లి, జంబుగుండ్లపల్లి, లక్కనపల్లి నుంచి శెట్టిపల్లి మీదుగా బురిశెట్టిపల్లి తదితర గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం లేదు. పెద్దపంజాణి మండలంలోని మామడుగు, పత్తికొండ మీదుగా మాడికి అసలు ఆటోలు కూడా లేవు. ఇదే మండలంలోని మరో పది గ్రామాలకు ఇదే పరిస్థితి నెలకొంది. వీకోట మండలంలో 30 గ్రామాలకు రోడ్లున్నా బస్సులు వెళ్లడం లేదు.

గిట్టుబాటు కాదట

ఈ మార్గాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ విముఖత చూపుతోంది. ఈపీకే (ఎర్నింగ్ ఫర్ కిలోమీటర్) గిట్టుబాటు కాకపోవడంతోనే బస్సులు నడపడం లేదని అధికారులు చెబుతున్నారు. దానికి తోడు ఆటోలతో తమకు నష్టాలు తప్పవని చెబుతున్నారు.

రైతులకు తప్పని ఇక్కట్లు

ఈమార్గాల్లోని రైతులు పండించే పంటలను మార్కెట్‌కు తరలించడం కష్టంగా మారింది. దీంతో రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి పలికారు. ఇక ఎవరికైనా అనారోగ్యం చేస్తే బైక్‌లపై పట్టణానికి వెళ్లాల్సిందే. అటవీప్రాంత గ్రామాలకు చెందిన బాలికలను తల్లిదండ్రులు పాఠశాలలు, కళాశాలలకు సైతం పంపడం లేదు.

వ్యవసాయ ఉత్పత్తులను తరలించాలంటే కష్టంగా వుంది

మా పంచాయతీలోని పలు గ్రామాలకు బస్సులు రావడం లేదు. ఆటోలే దిక్కు. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలంటే కష్టంగా వుంది. ఎవరికైనా జబ్బు చేస్తే ప్రైవేటుగా ఆటోను పిలిపించి వందల్లో ఇవ్వాల్సి వస్తోంది. గతంలో బస్సులుండేవి. ఇప్పుడు చెత్తపెంట బస్సు కాలువపల్లి మీదుగా పొద్దున సాయంత్రం వస్తుంది. పలమనేరు నుంచి మా గ్రామానికే బస్సు కావాలని పదేళ్లుగా పోరాడుతున్నాం.

–హరికృష్ణ, మాజీ సర్పంచ్, మండీపేటకోటూరు

మాకు కాలినడకే దిక్కు

మా గ్రామానికి వెళ్లాలంటే పత్తికొండ నుంచి లేదా దండపల్లి మీదుగా రావాలి. ఈ మార్గాల్లో బస్సులు లేవు. పత్తికొండ లేదా మామడుగు నుంచి తారు రోడ్డున్నా కనీసం ఆటో సౌకర్యం కూడా లేదు. దీంతో మాడి రోడ్డు లేదా పత్తికొండ నుంచి కాలినడకన గ్రామానికి వెళుతున్నాం. అత్యవసర సమయంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులను ఆస్పత్రికి తీసుకెళ్లడం కష్టంగా వుంటోంది. ప్రభుత్వం స్పందించి బస్సులు నడపాలి.

–మునిరత్నం రెడ్డి, బత్తలపల్లి, పెద్దపంజాణి మండలం

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

రొంపిచెర్ల: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి వుండాలని టాటా ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ హేమంత్ కుమార్ తెలిపారు. రొంపిచెర్ల బాలికలు, ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు గురువారం శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్, అడ్వాన్స్‌డ్ రీసెర్స్ టాటా కేన్సర్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాన్సర్‌పై అవగాహన కల్పించారు. సుమారు 550 మంది విద్యార్థులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం అమర్‌శేఖర్, టాటా ఫౌండేషన్ అధికారి మునిదామోదర్, తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించండి



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: పార్టీలకతీతంగా అర్హత వున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ యువరాజ్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బదిలీపై మండలానికి వచ్చిన సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మండలంలో రీ వెరిఫికేషన్ పేరుతో 56 మంది పింఛన్లను నిలిపేసిందని తెలిపారు. గతంలో సదరం సర్టిఫికెట్ పొంది అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను వచ్చేలా చూడాలన్నారు. కొన్ని పంచాయతీల్లో పార్టీ విభేదాలతో రాయితీ వేరుశనగ విత్తనాలు రైతులకు అందలేదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మామిడి రైతుల జాబితాపై గ్రామసభలు



రైతుల వివరాలను తెలియజేస్తున్న అధికారులు

పులిచెర్ల (కల్లూరు): మండీలు, ఫ్యాక్టరీలు, ర్యాంపులకు మామిడి కాయలు తోలిన రైతుల వివరాలతో కూడిన జాబితాపై అభ్యంతరాలు వుంటే తెలపాలని ఉద్యాన అధికారిణి సంతోషికుమారి తెలిపారు. ఆమె గురువారం దిగువపోకలవారిపల్లె, ఎల్లంకివారిపల్లె సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతుల వివరాలతో కూడిన జాబితాలను ఆయా సచివాలయాల్లో ఏర్పాటుచేశామన్నారు. వాటిని పరిశీలించుకుని అభ్యంతరాలు వుంటే తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పేరు లేని రైతులు తగిన డాక్యుమెంట్లను రైతు సేవా కేంద్రాల్లో అందజేయాలని సూచించారు.

127 మంది మామిడి రైతులకు నిధుల మంజూరు

రొంపిచెర్ల: మండలంలో తోతాపురి మామిడి కాయలు విక్రయించిన 127 మంది రైతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తహసీల్దార్ అమరనాథ్ తెలిపారు. ఆయన గురువారం రొంపిచెర్ల రైతు సేవా కేంద్రంలో మామిడి కాయలు విక్రయించిన రైతుల వివరాలతో కూడిన జాబితాను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 127 మంది మామిడి రైతులు 627 మెట్రిక్ టన్నుల మామిడి కాయలను విక్రయించారని తెలిపారు. వీరి బ్యాంక్ ఖాతాల్లోకి కిలోకు రూ.4 వంతున నిధులు జమ చేస్తామని తెలిపారు. రైతులు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. జాబితాపై అభ్యంతరాలు వుంటే తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రావణి, మామిడి రైతులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీల వినతి



బైరెడ్డిపల్లె: సీడీపీవోకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



తహసీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న అంగన్‌వాడీలు

రొంపిచెర్ల: వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. వారు గురువారం తహసీల్దార్ అమరనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. పులిచెర్ల ప్రాజెక్టు అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం, 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. 42 రోజులు సమ్మె చేస్తే 2024 జూలైలో వేతనాలు పెంచుతామని ఏపీ ప్రభుత్వం మినిట్స్ ఇచ్చిందని తెలిపారు. ఇప్పటి వరకు జీతాలు పెంచలేదన్నారు. యాప్‌లన్నీ ఒకటిగా చేసి ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన కార్యకర్తలు, హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంపత్ కుమార్, శోభ, నాగరత్న, హైమావతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

బైరెడ్డిపల్లె: తమకు కనీస వేతనాలు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు డిమాండ్ చేశారు. వారు గురువారం బైరెడ్డిపల్లె సచివాలయం–2 వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం పని చేయలేమని తెలిపారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపేదిలేదన్నారు. అనంతరం సీడీపీవో మాధవీలతకు వినతి పత్రం అందజేశారు.

ఏనుగులతో అప్రమత్తంగా ఉండాలి

పులిచెర్ల(కల్లూరు): ఏనుగుల గుంపు కల్లూరు రిజర్వు ఫారెస్టు సమీపంలోని పదిపుట్ల బైలు ఫారెస్టులోకి ప్రవేశించాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. అవి కల్లూరు ఫారెస్టులోకి వచ్చే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తగా వుండాలని పేర్కొన్నారు. రాత్రిళ్లు పొలాల్లోకి వెళ్లకూడదని, తెల్లని దుస్తులు ధరించవద్దని తెలిపారు. ఏనుగులు కనిపిస్తే తరమడం లేదా అదిలించడం చేయవద్దన్నారు. వెంటనే 9550067503 నంబర్‌కు కాల్ చేసి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు



బస్సు షెల్టర్ లేకపోవడంతో రోడ్డు పైనే వేచి ఉన్న విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై శంకర్రాయలపేట – రామసముద్రం వెళ్లే రెండు రోడ్లలో బస్ షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యమూ వందలాది మంది విద్యార్థులు, ప్రజలు పుంగనూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు స్టాపింగ్ ఉన్న ప్రాంతంలో షెల్టర్లు లేకపోవడంతో ఎండకు, వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చెరువు కట్టపై వున్న రాళ్లపై కూర్చుంటున్నారు. చెరువులో నీరు వున్న నేపథ్యంలో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, షెల్టర్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కాణిపాకంలో ఆర్‌జేసీ తనిఖీలు



లడ్డూ పోటును పరిశీలిస్తున్న ఆర్‌జేసీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని పలు విభాగాలను గురువారం ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్ తనిఖీ చేశారు. లడ్డుపోటు, అన్నదాన భవనంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పులిహోర, లడ్డూను రుచి చూశారు. అన్నదాన భవనంలో భక్తులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు ప్రసాద్, హరి మాధవరెడ్డి, ధనుంజయ, సిబ్బంది కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల శాంతియుత ర్యాలీ



వి.కోటలో ర్యాలీ చేస్తున్న హిందూ, ముస్లింలు

వి.కోట: మండల కేంద్రమైన వి.కోటలో గురువారం సాయంత్రం హిందూ, ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మండల అధికారులు గతవారం పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై కులమతాలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం హిందువులు, ముస్లింలు కలిసి అంబేడ్కర్ సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ వి.కోటలో వున్న హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా ఉంటూ మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఎవరైనా వర్గ విభేదాలు, మతాలను వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, ఎదుటివారి మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సోమశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ్ సంతోష్, డాక్టర్ తమీమ్, రామన్న, రంగనాథ్, అక్మల్, అఖిల్, నవాజ్, అబ్బూఖాన్ పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



నక్కబండలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పుంగనూరు: కూటమి ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ప్రజలను నిలువునా మోసం చేసిందని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్ సీపీ సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్ షరీఫ్ ఆరోపించారు. వారు గురువారం పుంగనూరు పట్టణంలోని నక్కబండ ప్రాంతంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల అమలులో చేస్తున్న మోసాలను వివరించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో జరిగిన మంచిని, ఇప్పుడు జరుగుతున్న మోసాలను గుర్తించాలని కోరారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్లు, స్కానర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అమరేంద్ర, నాయకులు ఖాదర్, ఇంతియాజ్, మహబూబ్‌బాషా, రమణ, సలామత్, నరేష్, శ్రీనివాసులు, రాఘవ, ఖాదర్‌బాషా, ఎంఎం.ఆనంద, నజీర్, గౌస్, అస్లాంమురాధి, ఆఫ్రీద్, రషీదబేగం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి



పుంగనూరు: మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు: వినాయకుడి విగ్రహాలు ఏర్పాటుచేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన గురువారం ఎస్ఐలు హరిప్రసాద్, రమణ, ట్రైనీ ఎస్ఐ చందన ప్రియతో కలిసి ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానా కట్టాల్సిన అవసరం లేదన్నారు. హెచ్‌టీటీపీఎస్//గణేష్ ఉత్సవ్‌డాట్‌నెట్‌లో లాగిన్ అయి పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, మండపం ఏర్పాటు వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు.

పలమనేరు: వినాయక చవితి విగ్రహాలను ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పలమనేరు డీఎస్పీ డేరంగుల ప్రభాకర్ తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఉత్సవ కమిటీ సభ్యులు GANEHHUTAV.NET అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన వారి మొబైల్‌కు క్యూఆర్ కోడ్ వస్తుందని తెలిపారు. దాన్ని పోలీసులు మండపాల వద్ద తనిఖీ చేస్తారని తెలిపారు. విగ్రహాలను ఏర్పాటు చేసిన చోట్ల విధిగా సీసీ కెమెరాలు పెట్టాలన్నారు.


వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



కుప్పం పట్టణంలో ఊరేగుతున్న స్వామి వారు

కుప్పం రూరల్: కుప్పం పట్టణంలో గురువారం శ్రీకృష్ణుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈ నెల 16వ తేదీన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కుప్పం ప్యాలెస్ కాంపౌండ్‌లో శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రతిష్టించారు. ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ప్రతిమను కుప్పం పట్టణంలో కోలాటాలు, కృష్ణుడి నామస్మరణ మధ్య ఊరేగింపు చేపట్టారు. ప్రజలు స్వామి వారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు కృష్ణ, కృష్ణారెడ్డి, శరవణ, నాగరాజు, దేవరాజు, పార్థసారథి, వెంకటేష్, వెంకటలక్ష్మీ, ఇందు, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం



విశేషాలంకరణలో స్వామి వారు

పలమనేరు: పట్టణంలోని పాతపేటలో వెలసిన సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఇందులో పాల్గొన్న దంపతులకు ఆలయ నిర్వాహకులు కండువా, లడ్డూ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు లేగ దూడల ప్రదర్శన

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తామని వెటర్నరీ అధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. సంకరజాతి లేగ దూడలు 0–18 నెలల వయస్సు ఉన్న సుమారు 50 దూడలను ప్రదర్శిస్తామని వివరించారు. ఇందులో మూడు ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు. రైతులు లేగ దూడలను తీసుకొచ్చి ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.